జమిలికి కేంద్రం ఆమోదం

మొదటిపేజీ తరువాయి...

అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం.వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. *1952*లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, *1967* వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరుపడం మొదలైంది.

***18* సవరణలు, చేరికలతోనే సాధ్యం**

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలంటే చాలా రాష్ట్రాలు చట్టసభలను గడువు కంటే ముందే రద్దుచేయాల్సి ఉంటుంది. మరికొన్నింటి కాలవ్యవధిని పొడిగించాల్సిన అవసరమూ ఉండొచ్చు. కాబట్టి, జమిలి ఎన్నికలను నిర్వహించాలంటే దానికి సంబంధించిన బిల్లు తొలుత పార్లమెంట్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. జమిలి నిర్వహణకు రాజ్యాంగంలో మూడు కొత్త అధికరణలు చేర్చడంతో పాటు ప్రస్తుతం ఉన్న అధికరణల్లో *12* కొత్త సబ్ క్లాజ్‌లను చేర్చాల్సి ఉంటుందని, అసెంబ్లీలు కలిగిన కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన మూడు చట్టాలను మార్చాల్సి ఉంటుందని రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫారసు చేసింది.

సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకం: ప్రతిపక్షాలు

జమిలి ఎన్నికలు రాజ్యాంగవిరుద్ధమని, సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. ఈ బిల్లులను వ్యతిరేకిస్తామని ఆమె ప్రకటించారు. జమిలి నిర్వహణకు సరిపోయే బలగాలు, సదుపాయాలు దేశంలో ఉంటే జమ్ము కశ్మీర్, హర్యానా ఎన్నికలతో పాటు మహారాష్ట్ర, జార్ఖండ్‌కు ఒకేసారి ఎందుకు ఎన్నికలు జరపలేదని శివసేన(యూబీటీ) ఎంపీ అనీల్ దేశాయ్ ప్రశ్నించారు. తమతో పాటు ప్రతిపక్ష పార్టీలన్నీ జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నట్టు కాంగ్రెస్ ఎంపీ కే సురేశ్ పేర్కొన్నారు. డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీలు సైతం జమిలిని వ్యతిరేకించాయి. బీజేపీ, ఎన్డీఏ పక్ష పార్టీలు మాత్రం స్వాగతించాయి. జమిలితో ఎన్నికల వ్యయం తగ్గుతుందని పేర్కొన్నాయి.



జమిలి నిర్వహణ ఇలా.. (కోవింద్ కమిటీ సిఫారసులు)

- మొదటి దశలో లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో నిర్వహించాలి.
- రెండో దశలో లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు ముగిసిన *100* రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి.
- లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి జరిపేందుకు వీలుగా సాధారణ ఎన్నికల తర్వాత లోక్‌సభ భేటీ అయిన మొదటి రోజును 'అపాయింటెడ్ డేట్'గా రాష్ట్రపతి నోటిఫై చేయవచ్చు.
- జమిలి నాటికి కాలపరిమితి ముగియని అసెంబ్లీల గడువును కుదించాలి. గడువు తీరిన అసెంబ్లీల కాలపరిమితిని పెంచాలి.
- హంగ్ ఏర్పడినప్పుడు, ప్రభుత్వం మధ్యలోనే కూలిపోయినప్పుడు లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలి.
- మధ్యంతర ఎన్నికలు నిర్వహించగా ఏర్పడే కొత్త ప్రభుత్వం ఐదేండ్లలో మిగిలి ఉన్న గడువుకు మాత్రమే పని చేస్తుంది.
- అసెంబ్లీలకు మధ్యంతర ఎన్నికలు నిర్వహించినా కొత్త ప్రభుత్వం గడువు లోక్‌సభతో పాటే ముగుస్తుంది.
- అన్ని ఎన్నికలకు ఒకే ఓటరు జాబితా ఉండాలి. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌లతో సంప్రదించి కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ జాబితా రూపొందించాలి.
- జమిలి ఎన్నికలకు అవసరమైన ఈవీఎంలు, వీవీప్యాట్లు, సిబ్బంది, భద్రత వంటి ఏర్పాట్లపై ఈసీ ప్రణాళిక రూపొందించాలి.

ఎన్నికలు జరిగే రాష్ట్రాలు

2025లో.. ఢిల్లీ, బిహార్

2026లో..
పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం, కేరళ, పుదుచ్చేరి

2027లో..
మణిపూర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్, ఉత్తర్ ప్రదేశ్, గుజరాత్

2028లో..
హిమాచల్ ప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర, కర్ణాటక, తెలంగాణ, మిజోరం, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్

2029లో..
ఏపీ, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఒడిశా, హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్ము కశ్మీర్

ఏకకాల ఎన్నికలు సాధ్యమే!

జమిలి ఎన్నికలకు అవసరమైన రాజ్యాంగ సవరణలు చేసేందుకు పార్లమెంటు ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మంది సభ్యులు ఆమోదం తెలపాల్సి ఉంది. స్థూలంగా చూస్తే ఉభయ సభల్లో ఎన్డీఏకు ఇంత మద్దతు లేదు. లోక్‌సభలో 362 మంది మద్దతు అవసరం కాగా, ఎన్డీఏకు ఇప్పుడు 293 మంది ఎంపీల మద్దతు ఉంది. అయితే, బిల్లులు సభలో ప్రవేశపెట్టినప్పుడు సభకు హాజరైన సభ్యుల సంఖ్యను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నేపథ్యంలో విపక్షాల్లో అనైక్యత ఎన్డీఏకు అనుకూలంగా మారే అవకాశం ఉంది. ఇండియా కూటమిలోని కొన్ని పార్టీలు జమిలికి మద్దతు ఇవ్వడమో, సభకు గైర్హాజరు కావడమో జరిగితే బిల్లుల ఆమోదం సులువవుతుంది. ఎన్డీఏ, ఇండియా కూటమిలో లేని సభ్యులు మరో 13 మంది వరకు ఉన్నారు.

రాజ్యసభలో కీలకంగా తటస్థ పార్టీలు

రాజ్యసభలో జమిలి బిల్లుల ఆమోదానికి 164 మంది ఎంపీల మద్దతు అవసరం కాగా, ఎన్డీఏ బలం 125 మాత్రమే ఉంది. ఇప్పుడు మరో ఆరు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్డీఏ, ఇండియా కూటమిలో లేని పార్టీల సభ్యులు 24 మంది ఉన్నారు. వీరి మద్దతుతో పాటు ఇండియా కూటమిలోని పలు పార్టీల మద్దతు పొందినా లేదా సభకు గైర్హాజరైనా జమిలి బిల్లులు ఆమోదం పొందే అవకాశం ఉంది. దీనికి తోడు జమిలి ఎన్నికల బిల్లుకు కనీసం 14 రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం అవసరం. ప్రస్తుతం 20 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉన్నందున రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం సులభమే. జమిలిపై కోవింద్ కమిటీ రాజకీయ పార్టీల అభిప్రాయాలు కోరగా.. 32 పార్టీలు మద్దతు తెలిపాయి. కాంగ్రెస్, ఆప్, సీపీఎం సహా 15 పార్టీలు వ్యతిరేకించాయి. ఈ లెక్కలన్నీ వేసుకొనే బీజేపీ ముందుకు వెళ్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జమిలి ఎన్నికలు జరుగాలంటే?



మనోవర్తికి అష్ట సూత్రాలు

- ఎనిమిది అంశాల ఆధారంగా భరణం నిర్ణయం
- విడాకుల కేసులపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు
- భర్త ఆర్థిక స్థితిని పరిగణనలోకి తీసుకోవాలని సూచన

న్యూఢిల్లీ: విడాకులు తీసుకున్న భార్యకు భర్త చెల్లించాల్సిన మనోవర్తికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మనోవర్తిని నిర్ణయించేందుకు ఎనిమిది అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నది. ప్రవీణ్ కుమార్ జైన్, అంజు జైన్ విడాకుల కేసును విచారించిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న వీ వరాలే ధర్మాసనం బుధవారం ఈ తీర్పు చెప్పింది. అంజు జైన్‌కు రూ.*5* కోట్ల భరణాన్ని చెల్లించాలని ప్రవీణ్ కుమార్ జైన్‌కు ఆదేశించింది. విడాకుల కేసులో భార్య, ఆమె బంధువులు, న్యాయమూర్తి వేధిస్తున్నారని ఆరోపిస్తూ బెంగళూరులో ఐటీ ఉద్యోగి అతుల్ సుభాష్ ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశమైన సందర్భంలో సుప్రీంకోర్టు తీర్పు విడాకుల కేసుల్లో కీలకంగా మారనుంది.

భరణాన్ని నిర్ణయించేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు

- భార్యాభర్తల సామాజిక, ఆర్థిక స్థితి
- భార్య, పిల్లల భవిష్యత్తు కనీస అవసరాలు
- భార్యాభర్తల విద్యార్హతలు
- ఆదాయ వనరులు, ఆస్తులు
- అత్తింటి వారి ఇంట్లో ఉన్నప్పుడు భార్య జీవనశైలి
- భార్య ఉద్యోగ, ఉపాధి స్థితి
- భార్య నిరుద్యోగి అయితే న్యాయపోరాటానికి అయ్యే సహేతుకమైన ఖర్చు
- భర్త ఆర్థిక స్థితి, ఆదాయం, ఇతర బాధ్యతలు.

ప్రపంచవ్యాప్తంగా చాట్‌జీపీటీ సేవలకు అంతరాయం

న్యూఢిల్లీ: ఓపెన్‌ఏఐకి చెందిన చాట్ బాట్ చాట్‌జీపీటీ సేవలకు ప్రపంచ వ్యాప్తంగా గురువారం అంతరాయం ఏర్పడింది. ఈ ప్రభావం ఓపెన్‌ఏఐకి చెందిన ఏపీఐ, సోరా ప్లాట్‌ఫామ్స్‌పై కూడా పడింది. దీంతో యూజర్లు తీవ్ర అసహనానికి గురయ్యారు. ప్రస్తుతం చాట్‌జీపీటీ సేవలకు అంతరాయం కలుగుతున్నదని, సమస్యను గుర్తించామని ఓపెన్‌ఏఐ ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. ఈ లోపాన్ని సరిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పింది. ఏపీఐపై ఆధారపడిన సంస్థలు కూడా ఎక్స్ వేదికగా తమ ఆవేదనను పంచుకున్నాయి. లాగిన్ ప్రాసెస్ స్లో అయిందని, పనితీరు క్షీణించిందని తెలిపాయి. చాట్‌జీపీటీ ఆఫ్‌లైన్ అయిందని ఫిర్యాదులు పెరుగుతున్నట్లు డౌన్‌డిటెక్టర్ అనే ఔటేజ్ మానిటరింగ్ సర్వీస్ తెలిపింది.

భారీగా ఐపీఎస్, ఐపీఎస్ ఖాళీలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: ఐఏఎస్ పోస్టులు-1,316, ఐపీఎస్ పోస్టులు-586 ఖాళీలున్నాయని కేంద్రం తాజాగా వెల్లడించింది. 1 జనవరి 2024 నాటికి ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ పోస్టుల భర్తీ, ఖాళీలు సహా ఇతర వివరాల్ని కేంద్రం పార్లమెంట్‌లో సభ్యులకు అందజేసింది.

ఐఏఎస్ ఖాళీలు

మంజూరైనవి	6858
విధుల్లో ఉన్నది	5,542
ఖాళీలు	1,316

ఐపీఎస్ ఖాళీలు

మంజూరైన పోస్టులు	5,055
విధుల్లో ఉన్నవారు:	4,469
ఖాళీలు:	586

ఐఎఫ్ఎస్ ఖాళీలు

మంజూరైన పోస్టులు:	3,193
విధుల్లో ఉన్నవారు:	2,151
ఖాళీలు:	1,042

ప్రార్థనా స్థలాల సర్వేలపై స్టే

ప్రార్థనా స్థలాల చట్టం చెల్లుబాటుపై విచారణ పూర్తయ్యే వరకు కొత్తగా వ్యాజ్యాలు స్వీకరించొద్దు

దేశవ్యాప్తంగా అన్ని కోర్టులకూ సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : మతపరమైన ప్రార్థనా స్థలాలను సర్వే చేయాలని కోరుతూ కొత్తగా దాఖలయ్యే పిటిషన్లను స్వీకరించరాదని, ప్రస్తుతం విచారణలో ఉన్న పిటిషన్లపై తాత్కాలిక లేదా తుది ఉత్తర్వులు జారీ చేయరాదని దేశంలోని అన్ని కోర్టులను సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 చెల్లుబాటుపై విచారణ జరిపి, తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు కోర్టులు సంయమనం పాటించాలని తెలిపింది. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. దీంతో జ్ఞానవాపి, మథుర, సంభల్ సహా 10 మసీదులు, దర్గాలపై హిందూ పిటిషనర్లు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ నిలిచిపోయింది. వీటి మతపరమైన అసలు స్వభావాన్ని తెలుసుకునేందుకు సర్వే చేయాలని ఈ పిటిషనర్లు కోరుతున్నారు. సీజేఐ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం 6 పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలను ఇచ్చింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 నిబంధనలను సవాల్ చేస్తూ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్ కూడా వీటిలో ఉంది. ఈ పిటిషన్లపై నాలుగు వారాల్లోగా స్పందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 ప్రకారం, మతపరమైన ప్రార్థనా స్థలాలు 1947 ఆగస్టు 15న ఏ విధంగా ఉన్నాయో, అదే పరిస్థితిని కొనసాగించాలి. వాటి మతపరమైన స్వభావాన్ని మార్చకూడదు. ఈ చట్టాన్ని హిందూ సంస్థలు, మరికొందరు పిటిషనర్లు సవాల్ చేశారు. ఈ చట్టం హిందువులు, జైనులు, బౌద్ధులు, సిక్కుల హక్కులను ఉల్లంఘిస్తున్నదని ఆరోపించారు.

లాభాలొస్తున్నా.. జీతాల పెంపేదీ?

న్యూఢిల్లీ: మన దేశంలో కార్పొరేట్ కంపెనీలకు గత నాలుగేళ్లలో లాభాలు నాలుగు రెట్లు పెరిగాయి. కానీ అవి ఉద్యోగుల జీతాలను మాత్రం పెంచడం లేదు. ఫిక్కీ-క్వెస్ కార్ప్ నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. 2019-2023 మధ్య కాలంలో కాంపౌండెడ్ వార్షిక వేతన వృద్ధి రేటు 0.8 శాతం నుంచి 5.4 శాతం మధ్య ఉంది. ఈ నివేదికను తయారు చేయడం కోసం ఆరు రంగాలను అధ్యయనం చేశారు. వీటిలో ఎఫ్ఎంసీజీ రంగంలో మాత్రమే వేతనాల వృద్ధి ఎక్కువగా (5.4 శాతం) ఉంది. ప్రైవేట్ రంగంలో వేతనాలు తిరోగమన వృద్ధిలో ఉన్నాయని ఈ నివేదిక తెలిపింది. వేతనాల వృద్ధి నెగెటివ్‌గా ఉండటం వల్ల వినియోగశక్తి తగ్గిందని, ఫలితంగా భారత దేశ ఆర్థిక వృద్ధి దెబ్బతిందని వెల్లడించింది.

పేరుకుపోతున్న పెండింగ్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలోని న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు పేరుకుపోతున్నాయి. సుప్రీంకోర్టు నుంచి సబార్డినేట్ కోర్టుల వరకు వివిధ న్యాయస్థానాల్లో *5.15* కోట్ల కేసులు పెండింగ్ ఉన్నట్టు కేంద్రం గురువారం పార్లమెంట్‌లో వెల్లడించింది.

పెండింగ్ కేసులు ఇలా	
సుప్రీంకోర్టు:	*82,171*
హైకోర్టులు:	*57.82* లక్షలు
సబార్డినేట్ కోర్టులు	*4.56* కోట్లు
మొత్తం పెండింగ్ కేసులు	*5.15* కోట్లు

న్యాయమూర్తుల ఖాళీలు	
హైకోర్టులు:	*368*
సబార్డినేట్ కోర్టులు:	*5,262*

***21* మంది:** దేశంలో ప్రతి *10* లక్షల జనాభాకు ఉన్న న్యాయమూర్తులు

రోడ్డు ప్రమాదాలపై చర్చల్లో.. తలదించుకోవాల్సి వస్తున్నది

కేంద్ర రవాణా శాఖ మంత్రి గడ్కరీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: అంతర్జాతీయ వేదికల్లో పాల్గొన్నప్పుడు భారత్‌లోని రోడ్డు ప్రమాదాల అంశం చర్చకు వస్తే తాను తలదించుకోవాల్సి వస్తున్నదని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. గురువారం లోక్‌సభలో రోడ్డు ప్రమాదాలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. తాను కేంద్ర రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు దేశంలోని రోడ్డు ప్రమాదాలను *50* శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నానన్నారు. మానవ ప్రవర్తన మెరుగుపడాలంటే సమాజంలో మార్పు రావాలని, చట్టబద్ధమైన పాలనను గౌరవించాలని మంత్రి తెలిపారు. రహదారులపై ట్రక్కులను కొందరు ఇష్టానుసారం నిలిపివేస్తున్నారని, చాలా మంది ట్రక్కు డ్రైవర్లు లేన్ క్రమశిక్షణను పాటించరని, ఇవే ప్రమాదాలకు ప్రధాన కారణమని గడ్కరీ పేర్కొన్నారు.

దేశంలో రోడ్డు ప్రమాదాలు ఇలా

1.78 లక్షలు
దేశంలో ఏటా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారి సంఖ్య

60%- రోడ్డు ప్రమాద బాధితుల్లో 18-34 ఏండ్ల వయసువారు



రోడ్డు ప్రమాద మరణాలు

- ఉత్తరప్రదేశ్ -23000కుపైగా
- తమిళనాడు-18000కుపైగా
- మహారాష్ట్ర-15000కుపైగా
- మధ్యప్రదేశ్-13000కుపైగా

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల చర్యలను ఈసీ నిర్దేశించలేదు

పీపీల స్వతంత్రతను నొక్కిచెప్పిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసుల్లో ఈడీ, దాని డైరెక్టర్ తమ ప్రాసిక్యూటర్లకు ఆధారాలు అందజేయడంతో పాటు సలహాలు, సూచనలు అందచేయవచ్చునని, అయితే వారు కోర్టులో ఎలా ప్రవర్తించాలో నిర్దేశించలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయాధికారుల స్వతంత్రతను సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది. దర్యాప్తు సంస్థల ప్రభావం పరిమితం మాత్రమేనని స్పష్టం చేసింది. ఢిల్లీ వక్ఫ్ బోర్డు మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన జీషన్ హైదర్, దాద్ నసీర్‌లకు బెయిల్ మంజూరు చేస్తూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'కేసుకు సంబంధించి ప్రాసిక్యూటర్లకు ఈడీ సూచనలు ఇవ్వవచ్చు. అయితే వారు కోర్టులో ఎలా వ్యవహరించాలో సూచనలు ఇవ్వలేరు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఏడుగురు నక్సల్స్ ఎన్‌కౌంటర్

- ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు
- మృతుల్లో ఇద్దరు మహిళలు

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 12: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి తుపాకుల మోతతో దద్దరిల్లింది. మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన భీకర పోరులో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్-దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లోని దక్షిణ అబూజ్‌మడ్ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దండకారణ్యంలో మావోయిస్టులు సమావేశమవుతున్నట్టు పోలీస్ ఉన్నతాధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో నారాయణ్‌పూర్ జిల్లా రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ) బలగాలతో పాటు దంతేవాడ, బస్తర్, కొండగావ్ జిల్లాల సీఆర్‌పీఎఫ్ దళాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వీరికి మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు జరిగాయి. కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టుల మృతి చెందారు.

హెచ్-1బీ జీవిత భాగస్వాములకు

వర్క్ పర్మిట్ గడువు పొడిగింపు

వాషింగ్టన్, డిసెంబర్ 12: హెచ్-1బీ, ఎల్-1 వీసాదారులకు అమెరికా ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ వీసాదారుల జీవిత భాగస్వాముల కోసం ఆటోమేటిక్ వర్క్ పర్మిట్ పునరుద్ధరణ గడువును 180 రోజుల నుంచి 540 రోజులకు పొడిగిస్తున్నట్టు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ప్రకటించింది. అయితే ఇది 2022 మే 4వ తేదీన, ఆ తర్వాత దరఖాస్తు చేసే వారికి వచ్చే ఏడాది జనవరి 13 నుంచి అమలులోకి వస్తుందని వివరించింది. వర్క్ పర్మిట్ పునరుద్ధరణ ప్రక్రియలో ఆలస్యం అవుతుందని గతంలో నివేదికలు వచ్చిన కారణంగా వీసాదారుల పనికి ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ గడువును పెంచినట్టు వివరించింది. 2021 జనవరి నుంచి అమెరికా ఆర్థిక వ్యవస్థ 1.6 కోట్ల ఉద్యోగాలను కల్పించిందని, ప్రజలకు సహాయ సహకారాలు అందించడంలో పూర్తి అంకిత భావంతో పనిచేస్తున్నట్టు డీహెచ్ఎస్ కార్యదర్శి అలెజాండ్రో చెప్పారు.

తమిళనాడు దవాఖానలో

అగ్ని ప్రమాదం

చిన్నారి సహా ఆరుగురి మృతి

చెన్నై: తమిళనాడులోని దుండిగల్‌లో గురువారం రాత్రి దారుణం జరిగింది. ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ మైనర్ బాలుడు సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. వీరు లిఫ్ట్‌లో స్పృహ లేని స్థితిలో కనిపించినట్లు పోలీసులు, అగ్నిమాపక అధికారులు తెలిపారు. వారిని దవాఖానకు తరలించామని, వారు మరణించినట్లు వైద్యులు ప్రకటించారని చెప్పారు. ఈ దవాఖాన త్రిచి రోడ్డులో ఉంది. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు చెప్పారు. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక శకటాలు హుటాహుటిన చేరుకున్నాయి. చికిత్స పొందుతున్న ఇతర 30 మంది రోగులను ప్రభుత్వ జిల్లా దవాఖానకు తరలించారు.

టైమ్ 'పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షునిగా ప్రమాణం చేయబోతున్న డొనాల్డ్ ట్రంప్ 'టైమ్స్' మ్యాగజైన్ 'పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా రెండోసారి ఎంపికయ్యారు. ఈ ప్రకటన వెలువడిన అనంతరం ట్రంప్ గురువారం ఉదయం 9.30 గంటలకు న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఓపెనింగ్ బెల్‌ను మోగించారు. అంతకుముందు ఆయన స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో మాట్లాడుతూ, ఇది తనకు లభించిన అద్భుతమైన గౌరవమని తెలిపారు. టైమ్ మ్యాగజైన్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ గుర్తింపును 2016లో పొందానని, ఇప్పుడు మరోసారి ఆ గుర్తింపు లభించడం తనకు దక్కిన గొప్ప గౌరవమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రంప్ సతీమణి మెలానియా, ఆయన కుమార్తె ఇవాంక ట్రంప్, వైస్ ప్రెసిడెంట్ ఎలక్ట్ జేడీ వాన్స్ పాల్గొన్నారు.

ఇస్రో క్రయోజనిక్ ఇంజిన్ పరీక్ష విజయవంతం

బెంగళూరు, డిసెంబర్ 12: అంతరిక్ష ప్రయోగాల్లో భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మరో కీలక మైలురాయిని అధిగమించింది. నవంబర్ 29న ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో సీఈ20 క్రయోజెనిక్ ఇంజిన్ సీ-లెవల్ హాట్ టెస్టును విజయవంతంగా జరిపినట్టు ఇస్రో వెల్లడించింది. అంతరిక్షంలో వ్యోమనౌక మళ్లీ స్టార్ట్ కావడానికి కీలకమైన మల్టీ-ఎలిమెంట్ ఇగ్నైటర్ సామర్థ్యాన్ని పరీక్షించినట్టు తెలిపింది. సీ-లెవెల్ పరీక్షలో సాధారణంగా ఉండే వైబ్రేషన్, ఉష్ణ ఒత్తిడి వంటి సమస్యలకు పరిష్కారం నాజిల్ ప్రొటెక్షన్ వ్యవస్థను కూడా ఈ ఇంజిన్‌కు జతచేసినట్టు పేర్కొన్నది. ఇస్రో చేపట్టనున్న గగన్‌యాన్ మానవ వ్యోమనౌక ప్రాజెక్టులో ఇది కీలకపాత్ర పోషించనున్నట్టు తెలిపింది.

కర్ణాటకలో లింగాయత్‌ల నిరసనలు తీవ్రం

బెళగావి: కర్ణాటకలో ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీ) 2ఏ క్యాటగిరీలో తమను చేర్చాలని డిమాండ్ చేస్తున్న పంచమశాలి లింగాయత్‌లు పోరాటాన్ని ఉద్ధృతం చేశారు. కుడల సంగమ పంచమశాలి మఠాధిపతి బసవ జయమృత్యుంజయ స్వామి నేతృత్వంలో గురువారం వీరు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రస్తుతం ఈ వర్గం ఓబీసీ 3బీ క్యాటగిరీలో ఉంది. ప్రభుత్వోద్యోగాలు, విద్యా వకాశాల్లో 5% రిజర్వేషన్లు పొందుతున్నది. 2ఏ క్యాటగిరీలోకి చేర్చితే 15 % రిజర్వేషన్లు పొందవచ్చు. నిరసనలో పాల్గొన్న పంచమశాలి లింగాయత్‌లపై మంగళవారం లాఠీచార్జి జరిగింది.

ఆలయానికి ముస్లిం కళాకారుడి భారీ విరాళం

600 వజ్రాలతో రూబీ కిరీటం బహూకరణ

చెన్నై, డిసెంబర్ 12: భరతనాట్యం కళాకారుడు జహీర్ హుస్సేన్ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. తమిళనాడు తిరుచ్చిలోని 'శ్రీరంగం రంగనాథార్' ఆలయంపై ఎనలేని భక్తిని చాటుకున్నారు. ఒక గరుడ పచ్చ, 600 వజ్రాలతో తయారుచేయించిన రూబీ కిరీటాన్ని ఆ ఆలయానికి విరాళంగా అందజేశారు. ఎంతో విలువైన వజ్రాలు, రత్నాలను బంగారంపై పొదిగిన ఈ కిరీటాన్ని బుధవారం ఆలయ ప్రధాన అర్చకులకి అప్పగించారు. రాజస్థాన్ నుంచి తెప్పించిన ఎంతో ఖరీదైన 3,169 క్యారెట్లతో కూడిన రూబీ కిరీటాన్ని తయారు చేయడానికి తనకు 8 ఏండ్లు పట్టిందని జహీర్ హుస్సేన్ చెప్పారు. దేశంలో ప్రసిద్ధి చెందిన 108 వైష్ణవ క్షేత్రాల్లో తిరుచ్చి ఆలయం ఒకటి. ఇక్కడి ఆలయ రాజగోపురం ఆసియా ఖండంలోనే అతి పెద్దదిగా ఖ్యాతి పొందింది.

బృందావన్‌లో ఇస్కాన్

అంతర్జాతీయ విశ్వవిద్యాలయం

మథుర: బృందావన్‌లో ఇస్కాన్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తుందని ఉత్తరప్రదేశ్ మంత్రి యోగేంద్ర ఉపాధ్యాయ్ చెప్పారు. భగవద్గీత, సనాతన ధర్మాలను బోధిస్తుందని తెలిపారు. ఇది మన దేశ భవిష్యత్తు అవుతుందన్నారు. ఇస్కాన్ బ